


WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




సెప్టెంబర్ 13 ఆదివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 221 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SUNDAY SEPTEMBER 13 2026 | VOL:18 | ISSUE: 221 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్: సీఎం రేవంత్ రెడ్డి

**గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి**

**మండపాల నిర్వహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన**

**నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం**



వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్

(మిగతా 2వ పేజీలో..)

## బ్రిక్స్ వేదికగా మోదీ–జిన్‌పింగ్ భేటీ.. కలిసి ముందుకు సాగాలన్న చైనా అధ్యక్షుడు

**బ్రిక్స్ సదస్సు వేళ మోదీ, జిన్‌పింగ్ ద్వైపాక్షిక సమావేశం**

**భారత్, చైనా కలిసి నడవాలని పిలుపునిచ్చిన జిన్‌పింగ్**

**మోదీతో 21 సార్లు సమావేశమయ్యానన్న చైనా అధ్యక్షుడు**

**భారత్‌తో దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందాలకు సిద్ధమని ప్రకటన**

న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్–2026 శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ శనివారం భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ద్వైపాక్షిక అంశాలపై ఈ సందర్భంగా వారు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఇరు నేతలు సంయుక్త ప్రకటన విడుదల



(మిగతా 2వ పేజీలో..)

## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో లక్షల ఎకరాల అక్రమాలు**

**ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు**

**బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు**

**పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది**

**అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం**



గత బీఆర్ఎస్ ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో..)

## ఖైరతాబాద్ వినాయకుడు.. నేటి నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు

**భక్తుల దర్శనానికి సిద్ధమవుతున్న ఖైరతాబాద్ వినాయకుడు**

**భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ ఆంక్షలు**

**ఉత్సవాలు పూర్తయ్యేంత వరకు భక్తులు సహకరించాలని కోరిన పోలీసులు**

హైదరాబాద్‌లో అత్యంత ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ బడా గణేశ్ విగ్రహ ప్రతిష్ఠాపన, నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ కీలక ఆంక్షలు ప్రకటించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 12వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు.

ప్రధాన ట్రాఫిక్ మళ్లింపు వివరాలు:

రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్: పీవీ విగ్రహం వైపు

(మిగతా 2వ పేజీలో..)



## బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం.. కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

**మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు**

**వెంటనే రావాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దల నుంచి సందేశం**

**సురేఖతో నేరుగా మాట్లాడిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్**

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖ వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. వెంటనే బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నుంచి తొలగించిన మరుసటి రోజే హైకమాండ్ రంగంలోకి దిగడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది.నిన్న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, కొండా సురేఖతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం అండగా ఉంటుందని ఆమెకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ నుంచి పిలుపు రావడం గమనార్హం. మంత్రి పదవి కోల్పోయి అసంతృప్తితో ఉన్న కొండా సురేఖను బుజ్జగించేందుకే అధిష్ఠానం ఈ చర్యలు చేపట్టినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆమెకు కేబినెట్ స్థాయి పదవిని అప్పగించే యోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్ఠానం పిలుపు మేరకు కొండా సురేఖ ఢిల్లీ పర్యటన తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## తెలంగాణలో దంచికొడుతున్న వానలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**తెలంగాణపై అల్పపీడన ప్రభావం.. రెండ్రోజులు వర్షాలే**

**ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**గత 24 గంటల్లో పలుచోట్ల రికార్డుస్థాయి వర్షపాతం నమోదు**

**ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద నీరు.. అప్రమత్తమైన అధికారులు**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా

(మిగతా 2వ పేజీలో..)





విజయకేరటం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### పండుగలు మారుతున్నాయి.. సంప్రదాయాలు నిలవాలి!

పండుగలు అంటే కేవలం సెలవులు, కొత్త బట్టలు, విందులు, వినోదాలు మాత్రమే కాదు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ బంధాలు, సామాజిక విలువలను తరతరాలకు అందించే గొప్ప వేదికలు. కాలం మారుతున్న కొద్దీ పండుగలు జరుపుకునే విధానంలో మార్పులు రావడం సహజమే. సాంకేతికత పెరిగింది.. జీవనశైలి మారింది.. ఉమ్మడి కుటుంబాలు తగ్గి చిన్న కుటుంబాలు పెరిగాయి. అయినప్పటికీ పండుగల అసలు ఉద్దేశం మాత్రం మరుగున పడకూడదు.

ఒకప్పుడు పండుగ వచ్చిందంటే ఇంటిల్లిపాదీ కలిసి ఏర్పాట్లు చేసుకునేవారు. ఇంటిని శుభ్రం చేయడం, పిండి వంటలు చేయడం, బంధువులను ఆహ్వానించడం, పెద్దలను పలకరించడం, చిన్నలకు సంప్రదాయాల గురించి చెప్పడం వంటి కార్యక్రమాలతో ఇళ్లలో సందడి నెలకొనేది. ఇప్పుడు ఆ స్థానంలో ఆన్‌లైన్ షాపింగ్, సోషల్ మీడియా పోస్టులు, ఫొటోలు, వీడియోలు ఎక్కువయ్యాయి. ఇవి తప్పు కాదు. కానీ వాటి కారణంగా పండుగలోని ఆత్మీయత, అనుబంధం తగ్గిపోకూడదు.

సంప్రదాయాలకు కొత్త తరాన్ని దగ్గర చేయాలి

నేటి పిల్లలకు మన పండుగల వెనుక ఉన్న చరిత్ర, ఆచారాల ప్రాధాన్యం తెలియాల్సిన అవసరం ఉంది. పండుగ ఎందుకు జరుపుకుంటాం? దాని వెనుక ఉన్న సందేశం ఏమిటి? మన పూర్వీకులు ఏ విధంగా జరుపుకునేవారు? వంటి విషయాలను పెద్దలు పిల్లలకు వివరించాలి.

సంప్రదాయాలను బలవంతంగా రుద్దడం కాదు.. వాటి వెనుక ఉన్న మంచిని అర్థమయ్యేలా చెప్పడం ముఖ్యం. అప్పుడు మాత్రమే కొత్త తరం వాటిని ఆసక్తిగా స్వీకరిస్తుంది.

భక్తితో పాటు బాధ్యత కూడా

పండుగల సందర్భంగా భక్తి భావం ఎంత ముఖ్యమో.. పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. పూజలు, నిమజ్జనాలు, వేడుకల పేరుతో నీటి వనరులు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి. సాధ్యమైనంత వరకు పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలి.పండుగను ఘనంగా జరుపుకోవడం అంటే భారీగా ఖర్చు చేయడం కాదు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా, ప్రకృతికి నష్టం చేయకుండా, సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చేలా జరుపుకోవడమే నిజమైన వేడుక.

పండుగల్లో మానవత్వం కనిపించాలి

పండుగల అసలు అందం అందరూ ఆనందంగా ఉండటంలో ఉంది. మన ఇంట్లో పండుగ చేసుకుంటూ పక్కింటి పేద కుటుంబాన్ని పట్టించుకోకపోతే ఆ వేడుకకు పూర్తి అర్థం ఉండదు. మనకు చేతనైనంత సహాయం చేయడం, అవసరమైన వారికి ఆహారం అందించడం, వృద్ధులను పలకరించడం, ఒంటరిగా ఉన్నవారికి అండగా నిలవడం వంటి చిన్నచిన్న పనులే పండుగకు నిజమైన సార్థకతను తీసుకొస్తాయి.

సమాజంలో ఆర్థిక అసమానతలు ఉన్నప్పటికీ పండుగ సమయంలో అందరూ సంతోషంగా ఉండేలా చూడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. ఒకరి ఆనందం మరొకరి బాధకు కారణం కాకూడదు.

శబ్ద కాలుష్యానికీ పరిమితి అవసరం

పండుగల సందర్భంగా శబ్ద కాలుష్యం కూడా పెద్ద సమస్యగా మారుతోంది. అధిక శబ్దంతో మైకులు, డీజేలు, బాణసంచా వంటివి వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారికి ఇబ్బందులు కలిగించవచ్చు. పండుగ ఉత్సాహం ఇతరుల ప్రశాంతతను దెబ్బతీయకూడదు.వేడుకలకు సమయం, స్థలం, శబ్ద పరిమితులు వంటి నిబంధనలు ఉంటే వాటిని ప్రతి ఒక్కరూ పాటించాలి. చట్టాన్ని గౌరవించడం కూడా పండుగ సంస్కృతిలో భాగమే.

సోషల్ మీడియా కోసం కాదు.. మనసుల కోసం

ప్రస్తుతం ఏ వేడుక జరిగినా ముందుగా ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెట్టడంపైనే ఎక్కువ దృష్టి కనిపిస్తోంది. పండుగ జ్ఞాపకాలను పంచుకోవడం మంచిదే. కానీ పక్కన ఉన్న వ్యక్తితో మాట్లాడటానికి సమయం లేకుండా మొబైల్‌లోనే గడిపితే ఆ వేడుకలోని ఆత్మీయత ఎక్కడ ఉంటుంది పండుగ రోజుల్లో కొంత సమయాన్ని కుటుంబానికి కేటాయించాలి. పెద్దలతో మాట్లాడాలి. చిన్నలతో ఆడాలి. బంధువులను కలవాలి. ఇలాంటి అనుభవాలే జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాలుగా మారతాయి.

సంప్రదాయం.. సమకాలీనత కలిస్తేనే అందం

కాలానుగుణంగా పండుగల్లో మార్పులు రావడం అవసరమే. అయితే మార్పు పేరుతో సంప్రదాయాల అసలు ఉద్దేశాన్ని కోల్పోకూడదు. అదే సమయంలో సంప్రదాయం పేరుతో పర్యావరణానికి హాని చేసే పద్ధతులను కొనసాగించాల్సిన అవసరం కూడా లేదు.మంచిని కాపాడుకుంటూ.. చెడును వదిలి.. కాలానికి అనుగుణంగా ముందుకు సాగడమే నిజమైన సంప్రదాయం.పండుగలు మనకు ఒక్కరోజు ఆనందాన్ని ఇవ్వడమే కాదు.. కుటుంబాన్ని కలుపుతాయి, సమాజాన్ని దగ్గర చేస్తాయి, మన సంస్కృతిని గుర్తు చేస్తాయి. అందుకే ఈసారి పండుగను మరింత అర్థవంతంగా జరుపుకుందాం. ఖర్చు కంటే ఆప్యాయతకు, ఆర్భాటం కంటే ఆచరణకు, కాలుష్యం కంటే పర్యావరణానికి, స్వార్థం కంటే మానవత్వానికి ప్రాధాన్యం ఇద్దాం. పండుగ ముగిసిన తర్వాత మిగిలేది అలంకరణలు కాదు.. మనం పంచుకున్న ప్రేమ, ఆప్యాయత, మంచి జ్ఞాపకాలే. అదే పండుగల అసలైన పరమార్థం.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది” అని ఆయన స్పష్టం చేశారు.చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... “మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి” అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. “హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది” అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# బ్రిక్స్ వేదికగా మోదీ–జిన్‌పింగ్ భేటీ.. కలిసి ముందుకు సాగాలన్న చైనా అధ్యక్షుడు

మొదటి పేజీ తరువాయి)

చేశారు. సుమారు ఏడేళ్ల విరామం తర్వాత జిన్‌పింగ్ భారత్‌లో పర్యటిస్తుండటంతో ఈ భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ సందర్భంగా షీ జిన్‌పింగ్ మాట్లాడుతూ, ప్రపంచంలోని రెండు అతిపెద్ద దేశాలైన భారత్, చైనాలు కలిసికట్టుగా సాగాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ వేగవంతమైన అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పరస్పర సహకారంతో, ఒకరి బలాల నుంచి మరొకరు నేర్చుకుంటూ పురోగమించాలని ఆయన సూచించారు. భారత్‌తో దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకునేందుకు చైనా సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.బ్రిక్స్ సదస్సు ఆహ్వానం తన పుట్టినరోజు నాడే అందిందని జిన్‌పింగ్ గుర్తు చేసుకున్నారు. ప్రధాని మోదీతో తాను ఇప్పటివరకు 21 సార్లు సమావేశమయ్యానని, తమ నాయకత్వంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు స్థిరమైన దిశలో పయనిస్తున్నాయని ఆయన వివరించారు.మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధంపై కూడా జిన్‌పింగ్ స్పందించారు. ఈ యుద్ధం వల్ల ఆ ప్రాంతంలోని ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇది అంతర్జాతీయ సమాజ ప్రయోజనాలకు విఘాతమని అన్నారు. శాశ్వత, సమగ్ర కాల్పుల విరమణ దిశగా రాజకీయ పరిష్కారం కోసం అన్ని పక్షాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు బ్రిక్స్ సభ్య దేశాలతో కలిసి చైనా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ, బ్రిక్స్ అధ్యక్ష హోదాలో భారత్‌కు అందించిన మద్దతు, సహకారానికి చైనాకు కృతజ్ఞతలు తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చించేందుకు ఈ సమావేశం ఒక చక్కని వేదికగా నిలిచిందని, చైనాతో పలు కీలక అంశాలను ప్రస్తావించినట్లు ఆయన వెల్లడించారు. బ్రిక్స్ సమ్మిట్ నేపథ్యంలో చైనా అందించిన మద్దతు, సహకారానికి జిన్‌పింగ్‌కు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. ద్వైపాక్షిక సహకారంపై చర్చించేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.వచ్చే ఏడాది బ్రిక్స్‌కు చైనా సారథ్యం బ్రిక్స్ కూటమికి 2027లో చైనా అధ్యక్షత వహించనుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని నిర్మించి భవిష్యత్ ప్రణాళికలు రచిస్తామని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ శనివారం ప్రకటించారు. వచ్చే ఏడాది జరగనున్న 19వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు కూడా చైనానే ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ విషయాన్ని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ ‘ఎక్స్’ వేదికగా ధ్రువీకరించారు. బ్రిక్స్ సహకారంలో మూడో స్వర్ణ దశాబ్దానికి నాంది పలుకుతామని జిన్‌పింగ్ పేర్కొన్నట్లు ఆమె తెలిపారు.

# తెలంగాణలో దంచికొడుతున్న వానలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

మొదటి పేజీ తరువాయి)

వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండ్రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం కూడా ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది.గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో అత్యధికంగా 9.35 సెం.మీ., ఖమ్మం జిల్లా కారేపల్లిలో 6.5 సెం.మీ. వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో ఏకంగా 13.55 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడించాయి. ఈ వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టుల్లోకి 2,172 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు 1,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22–ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

## ఖైరతాబాద్ వినాయకుడు.. నేటి నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు

మొదటి పేజీ తరువాయి)

నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం మీదుగా మింట్‌కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలను రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిరంకారి జంక్షన్ వైపు మళ్లిస్తారు.

రాజ్‌దూత్ లేన్: రాజ్‌దూత్ లేన్ మీదుగా బడా గణేశ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ఇక్బాల్ మినార్ వైపు పంపిస్తారు.

మింట్ కాంపౌండ్: మింట్ కాంపౌండ్ మీదుగా ఐమాక్స్ వైపు వెళ్లే వాహనాలను మింట్ కాంపౌండ్ లైన్ వద్ద సెక్రటేరియట్ ఎక్స్ రోడ్డు వైపు, మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలను నెక్లెస్ రోటరీ వద్ద సెక్రటేరియట్ జంక్షన్ లేదా ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు మళ్లిస్తారు.



ఖైరతాబాద్ పోస్ట్‌ఆఫీస్ దారి: ఖైరతాబాద్ పోస్ట్‌ఆఫీస్ లేన్ మీదుగా రైల్వేగేటు వైపు వెళ్లే వాహనాలను పోస్ట్‌ఆఫీసు జంక్షన్ వద్ద పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ జంక్షన్ వైపు పంపిస్తారు.

భక్తుల వాహనాలకు కేటాయించిన పార్కింగ్ స్థలాలు:

నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ గార్డెన్ వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాలను రేస్ కోర్సు రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్‌ఎండీఏ పార్కింగ్ స్థలంతో పాటు ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఖైరతాబాద్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను విశ్వేశ్వరయ్య భవన్ ప్రాంగణంలో పార్కింగ్ చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. గణేశ్ నిమజ్జన ఉత్సవాలు పూర్తయ్యే వరకు వాహనదారులు, భక్తులు ఈ ఆంక్షలకు సహకరించాలని కోరారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక
సెప్టెంబర్ । ఆదివారం । 13 । 2026



# ప్రజా సమస్యలపై గొంతెత్తలేని ఎమ్మెల్యేలకు పదవులు ఎందుకు?

**అసెంబ్లీకి గైర్హాజరయ్యే ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రతిపక్ష నేతలపై చర్యలు తీసుకోవాలి**

**టిఆర్ఎస్ పరకాల నియోజకవర్గం ఇంచార్జ్ బొచ్చు రాజు స్వేరో డిమాండ్**

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 12**

తెలంగాణ శాసనసభ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రజాప్రతినిధులపై టిఆర్ఎస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి బొచ్చు రాజు స్వేరో తీవ్ర విమర్శలు చేశారు.ప్రజలు తమ ఓట్లతో ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్న ప్రతినిధులు అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై గళం వినిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి సభకు హాజరుకాకుండా ఉంటే ప్రజల సమస్యలను ఎవరు ప్రస్తావిస్తారని ఆయన ప్రశ్నించారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగులు విధులకు గైర్హాజరైతే నిబంధనల ప్రకారం నోటీసులు, క్రమశిక్షణ చర్యలు ఉంటాయని, మరి ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు తమ విధులకు దూరంగా ఉంటే వారిపై జవాబుదారీతనం ఎందుకు ఉండకూడదని బొచ్చు రాజు స్వేరో నిలదీశారు.అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు ఎవరైనా సరే సభకు హాజరుకాకుండా నిర్లక్ష్యం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా నిబంధనలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధుల హాజరు, బాధ్యత, జవాబుదారీతనంపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసి సమగ్రంగా చర్చించాలని కోరారు. రాజ్యాంగం, సభా నిబంధనలకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల విధులు, హాజరు విషయంలో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సభకు హాజరుకాని ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేక విధానం రూపొందించడానికి ప్రభుత్వం, శాసనసభ ముందుకు రావాలని కోరారు.ప్రజల ఓట్లతో లభించిన పదవి ప్రజలకు సేవ చేయడానికేనని, బాధ్యతలు నిర్వర్తించకుండా పదవుల్లో కొనసాగడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడమేనని బొచ్చు రాజు స్వేరో అన్నారు.అసెంబ్లీకి రాని ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఉందా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రజాప్రతినిధుల హాజరు, బాధ్యతల విషయంలో అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, కఠినమైన నిబంధనలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



# మనిషిని ఆలోచింపజేసే శక్తి హిందీ సాహిత్యంలో ఉంది విరహత్ అలీ





**హైదరాబాద్ సెప్టెంబర్ 12 విజయ కెరటం ప్రతినిధి**

హిందీ కేవలం ఒక భాష మాత్రమే కాదని, అది భారతదేశంలోని కోట్లాది ప్రజల భావాలను, సంస్కృతిని, ఆలోచనలను ఒకరికొకరికీ చేరువ చేసే శక్తివంతమైన వారధి అని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు.

"హిందీ దివాస్" వేడుకలో భాగంగా శనివారం నాడు

బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటీ ఏర్పాటు చేసిన సభకు ఆయన విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు.దేశంలోని వివిధ ప్రాంతాలు, భాషలు, సంస్కృతుల మధ్య అనుసంధానాన్ని పెంచడంలో హిందీ భాష కీలక పాత్ర పోషిస్తోందని ఆయన తెలిపారు. హిందీ భాషకు ఎంతో గొప్ప సాహిత్య సంపద ఉందని, కబీర్, తులసీదాస్, ప్రేమ్‌చంద్ వంటి మహనీయుల రచనలు భారతీయ సమాజాన్ని, మానవ విలువలను, సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించాయన్నారు. హిందీ సాహిత్యం మనిషిని ఆలోచింపజేసే శక్తిని కలిగి ఉందని విరాహత్ అలీ కొనియాడారు. భాష మన భావాలకు, పత్రిక మన గొంతుకకు బలాన్నిస్తే, స్వేచ్ఛా పత్రిక ప్రజాస్వామ్యానికి బలాన్ని ఇస్తుందని ఆయన స్పష్టం చేసారు.హిందీ భాష మరింత అభివృద్ధి చెందాలని, హిందీ పత్రికలు మరింత బలంగా ప్రజల పక్షాన నిలవాలని, దేశంలోని అన్ని భాషల పత్రికలు స్వేచ్ఛగా, నిర్భయంగా, బాధ్యతాయుతంగా పనిచేసే వాతావరణం ఏర్పడాలని విరాహత్ అలీ పేర్కొన్నారు

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీఆర్ఎస్ ప్రతిపక్ష నేతలు

**అసెంబ్లీ గౌరవాన్ని దిగజార్చుతున్న కేటిఆర్, హరీష్‌రావు: అర్షం అశోక్**

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 12 :**

ప్రజల సమస్యలను చర్చించాల్సిన అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటూ, శాసనసభ గౌరవాన్ని దిగజార్చే విధంగా బీఆర్ఎస్ ప్రతిపక్ష నాయకులు వ్యవహరిస్తున్నారని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్షం అశోక్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని తన స్వగృహంలో శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలవాల్సిన శాసనసభను రాజకీయ రాద్ధాంతానికి వేదికగా మార్చడం సరికాదని అర్షం అశోక్ అన్నారు. ప్రజలు తమ సమస్యలను చర్చించేందుకు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించాల్సింది పోయి, సభా కార్యక్రమాలను అడ్డుకోవడం, ఎమ్మెల్సీ తాత మధు, నవీన్ రెడ్డి స్పీకర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం, శాసనసభ గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.

దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలు సహించం

అసెంబ్లీ ఆవరణలో దళితులను కించపరిచే విధంగా వ్యవహరించడం, దళితులు కెసిఆర్ ఫామ్ హౌస్ ను ముట్టడిలో భాగంగా బిఆర్ఎస్ ప్రతిపక్ష నాయకులు,మహిళలు పసుపు నీళ్లతో దళితులు నడిచిన దారిని శుద్ధి చేయడం వంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని అశోక్ మండిపడ్డారు. దళితులను హీనంగా చూసే దొరల పాలన సంస్కృతి ఇంకా బీఆర్ఎస్ నాయకుల్లో కొనసాగుతోందా? అని ప్రశ్నించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ప్రత్యేక గౌరవం ఉంటుందని, ఆ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ప్రతిపక్షానికి ప్రజా సమస్యలను లేవనెత్తేందుకు అసెంబ్లీ ఒక గొప్ప వేదిక అని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యలపై చర్చకు సిద్ధం కావాలి

కేసీఆర్, హరీష్‌రావు సహా బీఆర్ఎస్ ప్రతిపక్ష నాయకులు రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించాలని ఆయన హితవు పలికారు. సభను అడ్డుకోవడం కాకుండా ప్రజల గొంతుకగా నిలవాలని సూచించారు.గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో జరిగిన పరిణామాలు, పరిపాలన, ఆర్థిక వ్యవహారాలపై కూడా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకులపై ఉందని ఆయన అన్నారు. గత పాలనపై సమాధానం చెప్పకుండా ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు.అసెంబ్లీ గౌరవాన్ని కాపాడటంతో పాటు దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఏ చర్యనైనా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని అశోక్ స్పష్టం చేశారు.




# సిరివెన్నెల కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన పి ఆర్

**నర్సంపేట సెప్టెంబర్ 12 విజయ కెరటం ప్రతినిధి**



వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నల్లబెల్లి మండల కేంద్రంలో పిట్టల రమేష్ ముదిరాజ్ చిన్న కూతురు సిరి వెన్నెల కరెంటు షాక్ తో మరణించగా పిఆర్ ముదిరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో సిరి వెన్నెల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నర్సంపేట నియోజకవర్గ నాయకులు ఓరుగంటి తిరుపతి ముదిరాజ్ సూచన మేరకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పెసరు రాజన్న ముదిరాజ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండు చిరంజీవి ముదిరాజ్ ల సూచన మేరకు దాతల సహకారంతో పిఆర్ ముదిరాజ్ సేవా సమితి జిల్లా బాధ్యులు తాళ్ల రవీందర్ ముదిరాజ్, పోలుదాసరి రమేష్ ముదిరాజ్ ల ఆధ్వర్యంలో పిట్టల సిరివెన్నెల ముదిరాజ్ కుటుంబానికి 20వేల రూపాయలు పిఆర్ ముదిరాజ్ సేవా సమితి సమక్షంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా ద్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుపేద ముదిరాజ్ కుటుంబాలకు పిఆర్ ముదిరాజ్ సేవా సమితి బాసటగా నిలబడుతున్నందుకు చాలా గర్వంగా ఉందని అన్నారు. ముందు ముందు ఇటువంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి మంచి గుర్తింపు పొంది మన్ననలు పొందాలని మనస్ఫూర్తిగా కొరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు పులి సదానందం ముదిరాజ్, సింగారపు రామకృష్ణ ముదిరాజ్, సామాజిక వేదిక మరియు ముదిరాజ్ సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్, వరంగల్ జిల్లా బాధ్యులు తాళ్ల రవీందర్ ముదిరాజ్, పోలుదాసరి రమేష్ ముదిరాజ్, ఎలబోయిన రాజు ముదిరాజ్, హనుమకొండ జిల్లా బాధ్యులు వాసు శ్రీనివాస్ ముదిరాజ్, అమ్మగారి శ్యామ్ ముదిరాజ్, నర్సంపేట డివిజన్ నాయకులు ముద్రబోయిన రమేష్ ముదిరాజ్, దుగ్గొండి మండల కార్యదర్శి పొన్నం రాజు ముదిరాజ్, జెట్టబోయిన శివ, స్థానిక గ్రామ సర్పంచ్ ప్రకాష్, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ గోనెల నరహరి ముదిరాజ్, కుల పెద్దలు పాండవుల రాంబాబు ముదిరాజ్, పిట్టల రామస్వామి ముదిరాజ్ లతో పాటు ముదిరాజ్ కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వము -వ్యవసాయ శాఖ

**నల్గొండ జిల్లా**

జిల్లాలోని రైతులందరికి తెలియజేయునది, వానాకాలం సీజన్ లో జిల్లాలోని రైతులు వివిధ రకాల పంటలను సాగు చేసినారు. అందులో పత్తి, వరి, కంది పంటలు, ఉద్యానవన పంటలు, వర్షభావ పరిస్థితుల వల్ల వేసిన ప్రత్యామ్నాయ పంటలు ఉన్నాయి.దాదాపు అన్ని రకాల పంటలకు మద్దతు ధర తో పాటు వరి పంటలో ప్రభుత్వం సూచించిన 7 రకాల సన్న వడ్లను సాగు చేసిన వారికి క్వింటల్ కు 500 రూపాయల బోనస్ కూడా వర్తిస్తుంది. దీనికి గాను ప్రస్తుత సీజన్ లో ప్రతి సర్వే నంబర్ లో సాగు చేసిన పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా గ్రామాలలో నియమింపబడిన సర్వేయర్లు ప్రతి చేనుకు వెళ్లి ఫోటో తీసి నమోదు చేయుచున్నారు. ఈ విదంగా చేయడం వలన ప్రతి పంట ఎంత విస్తీర్ణం లో వేసినారో తెలియడమే కాకుండా పంటల కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుంది. ఈ సర్వే పంటల కొనుగోలుకు అనుసంధానించబడి ఉన్నది.కావున గ్రామాలలో ఈ సర్వే జరుగుచున్నప్పుడు రైతులు సర్వేయర్ వెంట వెళ్లి, లేదా వారిని రైతుల పంట చేనులోకి తీసుకొని వెళ్లి వేసిన పంటను, వరి పంట అయితే ఏ రకం అనే విషయాన్ని కూడా నమోదు చేయించుకోవలసినదిగా తెలియజేయనైనది. ఈ సర్వేలో పంట నమోదుకు చివరి తేది 30 సెప్టెంబర్ 2026.

జిల్లా వ్యవసాయ అధికారి నల్గొండ జిల్లా

# ప్రజా సమస్యలపై గొంతెత్తలేని ఎమ్మెల్యేలకు పదవులు ఎందుకు?

**అసెంబ్లీకి గైర్హాజరయ్యే ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రతిపక్ష నేతలపై చర్యలు తీసుకోవాలి**

**టిఆర్ఎస్ పరకాల నియోజకవర్గం ఇంచార్జ్ బొచ్చు రాజు స్వేరో డిమాండ్**

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 12**

తెలంగాణ శాసనసభ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రజాప్రతినిధులపై టిఆర్ఎస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి బొచ్చు రాజు స్వేరో తీవ్ర విమర్శలు చేశారు.ప్రజలు తమ ఓట్లతో ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్న ప్రతినిధులు అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై గళం వినిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి సభకు హాజరుకాకుండా ఉంటే ప్రజల సమస్యలను ఎవరు ప్రస్తావిస్తారని ఆయన ప్రశ్నించారు.శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగులు విధులకు గైర్హాజరైతే నిబంధనల ప్రకారం నోటీసులు, క్రమశిక్షణ చర్యలు ఉంటాయని, మరి ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు తమ విధులకు దూరంగా ఉంటే వారిపై జవాబుదారీతనం ఎందుకు ఉండకూడదని బొచ్చు రాజు స్వేరో నిలదీశారు.అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు ఎవరైనా సరే సభకు హాజరుకాకుండా నిర్లక్ష్యం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా నిబంధనలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధుల హాజరు, బాధ్యత, జవాబుదారీతనంపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసి సమగ్రంగా చర్చించాలని కోరారు.రాజ్యాంగం, సభా నిబంధనలకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల విధులు, హాజరు విషయంలో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సభకు హాజరుకాని ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేక విధానం రూపొందించడానికి ప్రభుత్వం, శాసనసభ ముందుకు రావాలని కోరారు.ప్రజల ఓట్లతో లభించిన పదవి ప్రజలకు సేవ చేయడానికేనని, బాధ్యతలు నిర్వర్తించకుండా పదవుల్లో కొనసాగడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడమేనని బొచ్చు రాజు స్వేరో అన్నారు.అసెంబ్లీకి రాని ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఉందా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రజాప్రతినిధుల హాజరు, బాధ్యతల విషయంలో అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, కఠినమైన నిబంధనలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గణేష్ ఉత్సవాల మరియు నిమజ్జన ఏర్పాట్లపై అన్ని శాఖల సమన్వయంతో పరిశీలన

**నల్గొండ సెప్టెంబర్ 12 విజయ కెరటం ప్రతినిధి**



రానున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని నల్గొండ పట్టణంలో చేపట్టిన ఏర్పాట్లను పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, విద్యుత్, ఆర్అండ్‌బీ, వైద్య, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో కలిసి నల్గొండ డిఎస్పీ శివరాం రెడ్డి పరిశీలించారు.నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సజావుగా జరిగేలా నిమజ్జన మార్గం, ట్రాఫిక్ నియంత్రణ, రహదారులు, విద్యుత్ సౌకర్యాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు, బందోబస్తు మరియు ఇతర భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు అన్ని శాఖలకు సహకరిస్తూ శాంతియుతంగా మరియు భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులు కోరారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

## గురుపూజోత్సవం సందర్భంగా విశ్వభారవి ఫౌండేషన్ స్కూల్ టీచర్లకు సన్మానం.

**నల్లగొండ సెప్టెంబర్ 11 విజయ కెరటం ప్రతినిధి.**





నల్లగొండ పట్టణం బండారు గార్డెన్ నందు తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (TRSMA) ఆధ్వర్యంలో శుక్రవారం ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం మరియు టీచర్స్ కి గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వభారవి ఫౌండేషన్ స్కూల్ బి టి ఎస్ నల్లగొండ పాఠశాల డైరెక్టర్ కం సీఈవో జెరిపోతుల రవికుమార్,, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ మునగాల మురళి,, సెకండరీ గ్రేడ్ టీచర్ ఉమ్మి ఐ మాన్ గార్లకు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి నల్లగొండ విద్యాశాఖ అధికారి సుశీందర్రావు యాదాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి గార్ల చేతుల మీదుగా సన్మానం జరిగింది ఈ కార్యక్రమంలో వివిధ స్కూల్స్ యాజమాన్యం మరియు టీచర్లు పాల్గొన్నారు

## నిరుపేద విద్యార్థి కి ఆపన్న హస్తము అందించిన డాక్టర్ రామకృష్ణ దంపతులు

**సూర్యాపేట సెప్టెంబర్ 12 విజయ కెరటం ప్రతినిధి (ఎండి నియాజుద్దీన్)**



నిరుపేద ఎంబిబిఎస్ విద్యార్థులకు రూ 50 వేల ఆర్థిక సహాయం, పుస్తకాలు అందజేత నిరుపేద విద్యార్థులకు సమాజం కూడా తమ వంతు సహకారం అందించాలంటూ పిలుపు సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత 30 సంవత్సరాలుగా నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ ఎంతోమందికి ప్రాణదానం చేసిన విజయ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ లు మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు తమ సామాజిక బాధ్యతను మరోసారి చాటుకున్నారు. ఇటీవల పెన్పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థులు భీపంగ యశ్వంత్ నీట్ లో 1301 ర్యాంకు సాధించి ఉస్మానియాలో, మామిడి ఇందు నీట్ లో 10150 ర్యాంకుతో గాంధీ హాస్పిటల్లో ఎంబిబిఎస్ సీట్లు సాధించడం పట్ల అభినందిస్తూ ఒక్కొక్కరికి రూ :25 వేల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు మొదటి సంవత్సరానికి ఉపయోగపడే పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు ఉన్నత వైద్య విద్యలో సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు. వారు ఇరువురు పేదరికంలో ఉన్నారని చదువుకునేందుకు పేదరికం అడ్డుకాకూడదని ఆలోచనతో తాము ఈ ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. సమాజం కూడా స్పందించి వారి వైద్యవిద్యకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరాలలో కూడా ఇరువురి విద్యార్థులకు కావలసిన సహాయ సహకారాలను తమ ద్వారా అందజేస్తామన్నారు. డాక్టర్ దంపతుల దాతృత్వం పట్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.దాతలు అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకొని వైద్యవిద్యను విజయవంతంగా పూర్తి చేసి నిరుపేదలకు వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని అయ్యప్ప స్వామి సన్నిధిలో వరుణ యాగం

**సూర్యాపేట సెప్టెంబర్ 12 విజయ కెరటం ప్రతినిధి (ఎండి నియాజుద్దీన్)**



సూర్యాపేట పట్టణంలోని శబరి నగర్‌లో శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నిర్వహించిన వరుణ యాగంలో పాల్గొన్న ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది గారుఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని వారు ప్రార్థించారు.అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు



కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, చివ్వేంల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ నాయుడు, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఉప్పుల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు నాగు నాయక్, పడిదల రవి , చెంచల నిఖిల్, గుంటూరు చిట్టి బాబు, గుణగంటి సైదులు గౌడ్, గుండా వెంకన్న(సుమన్), రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి ఆశయాల కొనసాగింపే ఆయనకిచ్చే ఘన నివాళి

**నల్లగొండ సెప్టెంబర్ 12 విజయ కెరటం ప్రతినిధి**



సిపిఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఉత్తమ పార్లమెంటేరియన్ కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాల కొనసాగించే ఆయన కిచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు.శనివారం సిపిఎం జిల్లా కార్యాలయం దొడ్డి కొమురయ్య భవన్లో సీతారామ్ ఏచూరి చిత్రపటానికి అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందు చెల్లాచెదురుగా ఉన్న బిజెపి యేతర పార్టీలన్నింటినీ ఐక్యం చేయడంలో ఇండియా కూటమికి శ్రీకారం చుట్టడంలో కీలకపాత్ర పోషించిన బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్ప రాజకీయ ఆర్థికవేత్త , మార్క్సిస్టు, లెనినిస్ట్, ఒక సిద్ధాంత వేత్త సీతారాం ఏచూరిని కోల్పోవడం భారత రాజకీయాలకు తీరని నష్టం అని అన్నారు. గత 12 సంవత్సరాలుగా దేశాన్ని,దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మతోన్మాద ఎజెండాకు ఎదురు నిలిచి పోరాడుతూనే దేశంలో కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేసే కృషిచేసిన కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి.అని అన్నారు.1970 దశకంలో విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించి. క్రమక్రమంగా విద్యార్థి యువజన సంఘాలకు జాతీయస్థాయిలో నాయకత్వం వహించి నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీని అతి చిన్న వయస్సులో 1983లో ఎదురెల్లి వారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన దిశాలి. సిపిఎం కేంద్ర కమిటీ లోకి చిన్న వయస్సులో ఎదిగిన వారి పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తి.అని అన్నారు.సనాతన ధర్మాన్ని ఆచార సాంప్రదాయాలను పాటించే నేపథ్యం గల బ్రాహ్మణీయ కుటుంబం నుండి వచ్చిన వాటిని పటాపంచలు చేసి పేదలు వ్యవసాయ కార్మికులు కష్టజీవులు కార్మికుల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసి 50 ఏళ్ల పాటు వెనుదిరగకుండా దేశ రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగిన వారి జీవితం నేటి యువతకు ఒక గొప్ప ఆదర్శం. నీ కచ్చిగా మాట్లాడడం, వెన్ను చూపని ధీరత్వం ఆయనను దేశ రాజకీయాల్లో ఒక శక్తిగా నిలబెట్టింది.అని కొనియాడారు.తెలుగు,ఇంగ్లీషు, మలయాళం,బెంగాలీ లాంటి ఉర్దూ భాషల్లో తనకున్న ప్రావీణ్యం వారిని ప్రపంచ రాజకీయాల్లో కీలక నేతగా మార్చింది. నేపాల్ మావోయిస్టు పార్టీ ఆయుధాలను వదిలి పార్లమెంటరీ రాజకీయాల్లో ప్రవేశించే విషయంలో వారి సలహాలు సూచనలు తీసుకొని ముందుకు సాగిందనేది ప్రపంచానికి తెలిసిన ఒక బహిరంగ వాస్తవం.అని అన్నారు.భారత పార్లమెంట్లో రాజ్యసభకు రెండు పర్యాయాలు ఎన్నికైన వారు పోషించిన పాత్ర వారికి గొప్ప పార్లమెంటరీ నాయకుడిగా అవార్డులు ఇచ్చిన సందర్భంలో విపక్ష పార్టీల నేతలు వారి కోసం మాట్లాడిన మాటలు వారి దార్శనికతను పోరాటపటిమను గుర్తు చేస్తున్నాయి. భారత రాజ్యాంగ రక్షణకై సామాజిక సమస్యలపై దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాదంపై దళితులు,గిరిజనులు, ఆదివాసీలు, మైనార్టీ,క్రిస్టియన్ల,సిక్కులు, జైనులపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలు వారి హక్కుల ఉల్లంఘన పై పార్లమెంట్ లో వారు పోరాడిన తీరు వారి పదవి విరమణ సందర్భంగా ఇతర రాజకీయ నేతలను కన్నీరు పెట్టించింది. ఉత్తమ పార్లమెంటేరియన్ గా,రాజకీయవేత్తగానే కాకుండా పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఎండగడుతూ అనేక పుస్తకాలను రచించిన ఒక గొప్ప రచయితగా ఆయన గుర్తింపును పొందాడు.కమ్యూనిస్టు ఉద్యమ వ్యతిరేకులు సైతం ఆయనతో సైతాంతికంగా లేదా ఆర్థిక అంశాలపై సవాల్ చేసే సాహసం చేసే వారు కాదన్నది జగమెరిగిన సత్యం.సిపిఎం నిర్మాణంలో ఎలాంటి సమస్యలు రాకుండా అందర్నీ కలుపుకో పోవాలని ఐక్యంగా పార్టీ నిర్మాణాన్ని రూపొందించాలని వారి అంకితభావం సిపిఎంకు ప్రతిష్టను తెచ్చిపెట్టాయి.అని అన్నారు.దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా జరిగే ప్రతి ఆందోళనకు మద్దతు ఇవ్వడమో కాకుండా ప్రత్యక్ష పరోక్ష సహకారాన్ని అందించే విజయవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచడంలో కీలక భూమిక వారు పోషించారు. 2006 యూపీఏ వన్ ప్రభుత్వ ఏర్పాటు నిర్మాణంలో కీలకంగా వ్యవహరించి ఉపాధి హామీ చట్టం అటవీ హక్కుల చట్టం సమాచార చట్టం విద్యాహక్కు చట్టం లాంటి చట్టాలను సాధించడంలో వారిని ఎనలేని కృషి. దేశం ప్రమాదపుటంచుల్లో ఉన్న ఈ సమయంలో వారు లేకపోవడం దేశ రాజకీయాల్లో వారి ప్రాతినిధ్యం లేకుండా పోవడం సిపిఎం పార్టీకే కాకుండా భారత కమ్యూనిస్టు ఉద్యమాలకు ఎవరు తీర్చలేని నష్టం.వారి ఆశయాలను, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లే తరాలను తయారు చేయడమే వారికిచ్చే ఘన నివాళులు..అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం గంజి మురళీధర్ పుచ్చకాయల నర్సిరెడ్డి, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, మండల కార్యదర్శి నలపరాజు సైదులు,పట్టణ ,మండల కమిటీ తుమ్మల పద్మ, అవుట రవీందర్ పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి దండెంపల్లి సరోజ అద్దంకి నరసింహ బొల్లు రవీందర్, కొండ వెంకన్న సలివోజు సైదాచారి కొత్త అంజయ్య పుప్పాల మట్టయ్య పుష్పలత గంజి రాజేష్ శ్రీ వాణి సుష్మ రజిని,మారయ్య తదితరులు పాల్గొన్నారు

తుమ్మల వీరారెడ్డి
సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి నల్గొండ

## గణేష్ ఉత్సవ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం







**నల్గొండ సెప్టెంబర్ 12 విజయ కెరటం ప్రతినిధి నల్గొండ**

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను నిర్వహించనున్న నిర్వాహకులందరికీ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నల్గొండ డీఎస్పీ శ్రీ శివరాం రెడ్డి గారు గణేష్ ఉత్సవ నిర్వాహకులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు.ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా, పోలీస్ శాఖ సూచనలు మరియు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు డీఎస్పీ గారు స్పష్టంగా తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు నిర్వాహకులు సహకరించాలని కోరారు. అలాగే శాంతి భద్రతలు మరియు ప్రజా క్రమాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీ కె శివ రామ్ రెడ్డి ఇన్స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి గారు, నల్గొండ టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆదిరెడ్డి గారు, నల్గొండ వన్ టౌన్ ఎస్. ఐ లు జి ముత్తయ్య,, జె సైదులు గార్లు, నల్గొండ టూ టౌన్ ఎస్. ఐ సైదా బాబు., నల్గొండ రూరల్ ఎస్ ఐ శివ ప్రసాద్ గారు, మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలి

### రైస్ మిల్లర్ల ఆందోళనకు సిఐటియు మద్దతు

**నల్లగొండ సెప్టెంబర్ 12 విజయ కెరటం ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆగస్టు 11 నుండి జరుగుతున్న సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి యం.డి సలీమ్, జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య తెలిపారు.ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ . రైస్ మిల్లర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమ్మెను నివారించాలని, రైస్మిల్ పరిశ్రమపై ఆధారపడ్డ అన్నిరకాల కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ ప్రభ్యుత్వాన్ని డిమాండ్ చేస్తున్నదని వారు అన్నారు.గత 5-6 సంవత్సరాలుగా ఎఫ్సిఐ, సిఎస్సి స్పెసిఫికేషన్లకు అనుగుణంగా సూపర్ఫైన్ క్వాలిటీ బియ్యం అందించే విధానం వల్ల మిల్లింగ్ సమయంలో షార్టేజ్, సార్టెక్స్, గ్రేడింగ్ తదితర కారణాలతో మిల్లర్లకు భారీగా నష్టాలు వస్తున్నాయని, క్వింటా ధాన్యానికి 15-20 శాతం వరకు లోటును మిల్లర్లే భరించాల్సి వస్తోంది. మరోవైపు సిఎంఆర్ బియ్యం సకాలంలో తీసుకోకపోవడంతో మిల్లులు పూర్తి సామర్థ్యంతో పనిచేయలేకపోతున్నారు.ప్రభుత్వం ధాన్యం కేటాయింపులు, మిల్లింగ్ సామర్థ్యం, నిల్వ సామర్థ్యం, సిఎంఆర్ బాధ్యతలు, బియ్యం స్వీకరణ గడువుల మధ్య సమన్వయం తీసుకురావాలని, ప్రతి క్రాప్కు సిఎంఆర్ బియ్యం స్వీకరణకు స్పష్టమైన గడువు, ప్రణాళిక ప్రకటించి, ఒక క్రాప్ పూర్తయ్యే విధంగా తగిన సమయం ఇచ్చిన తర్వాతే తదుపరి ధాన్యం కేటాయింపులు చేయాలని వారు కోరారు. నిర్ణయించిన గడువులో బియ్యాన్ని క్రమం తప్పకుండా స్వీకరిస్తూ 100 శాతం సిఎంఆర్ బియ్యం అందించేందుకు సిద్ధంగా ఉన్న మిల్లర్లపై అనవసర ఒత్తిడి, కఠిన చర్యలు, కేసులు పెట్టకుండా చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలి. ధాన్యం, సిఎంఆర్ లెక్కలు పారదర్శకంగా ఉండేలా చూడాలి. మిల్లింగ్ ఛార్జీని ప్రస్తుతం ఉన్న చార్జిపై రూ.150కు పెంచడంతో పాటు మిల్లర్లపై ఉన్న 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీ భారాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.రైస్ మిల్లులు మూతపడటం వల్ల మిల్లర్లతో పాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండు లక్షల మంది ఉద్యోగులు, కార్మికులు ఉపాధి కోల్పోతారని, రైస్ మిల్లు డ్రైవర్లు, దినసరి కూలీలు, గుమస్తాలు, ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు, ఇతర రైస్ మిల్లు ఆధారిత కార్మికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు కూడా ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి మిల్లర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు వాటిపై ఆధారపడిన కార్మికులకు ఉపాధి, జీవనోపాధి కొనసాగించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నదని అన్నారు.విజిలెన్స్, పోలీస్ తనిఖీల పేరుతో మిల్లర్లలో నెలకొన్న భయాందోళనలను తొలగించి, సమస్యలను వేధింపులతో కాకుండా చర్చలు, సమన్వయంతో పరిష్కరించాలి. ప్రభుత్వం తక్షణమే రైస్ మిల్లర్లతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలి. లేకపోతే మిల్లర్లు చేపట్టే తదుపరి ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలకు సిఐటియు సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని తెలియజేస్తుందని వారు తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, నాయకులు అద్దంకి నర్సింహ సలివొజు సైదాచారి, సుంకరబోయిన వెంకన్న, తదితరులు పాల్గొన్నారు




Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528